క్లుప్తంగా

బీచ్ రోడ్డులో ఫుట్‌పాత్‌ల శుభ్రం



బీచ్ రోడ్డులో ఫుట్‌పాత్‌ను యంత్రంతో శుభ్రం చేస్తున్న సిబ్బంది

ఏయూక్యాంపస్: సాగర తీరంలో మురికిపట్టిన ఫుట్‌పాత్‌లను యంత్రంతో శుభ్రం చేస్తున్నారు. ఇసుక, మట్టి వంటివి సైతం తొలగిస్తున్నారు. బీచ్ రోడ్డులోని ఫుట్‌పాత్‌లపై దుకాణాలు, చిరువ్యాపారులు విక్రయాలు చేయడం వల్ల తినుబండారాలు అక్కడ చేరిపోతున్నాయి. మట్టి, ఇసుక వంటివి సైతం ఫుట్‌పాత్‌లపై పేరుకుపోతున్నాయి. దీంతో ఫుట్‌పాత్‌లు అధ్వానంగా తయారయ్యాయి. జీవీఎంసీ రహదారులను శుభ్రం చేసే యంత్రాలతో బీచ్ రోడ్డులో గురువారం ఫుట్‌పాత్‌లను శుభ్రం చేసే పనులు ప్రారంభించారు. వర్షం కురవడంతో ప్రస్తుతం ఫుట్‌పాత్‌లు శుభ్రం చేయడం కొంత సులభమవుతోంది.

బురదమయంగా ఓపెన్ జిమ్ పరిసరాలు



మ్యూజియం ఎదురుగా బురదతో నిండిన ఓపెన్ జిమ్ పరిసరాలు

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులో విశాఖ మ్యూజియం ఎదురుగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరిసరాలు బురదమయంగా మారాయి. వర్షపు నీరు నిలచిపోవడంతో ఈ ప్రాంతం బురదతో నిండిపోయింది. దీంతో నగరవాసులు వ్యాయామం చేయడానికి సాధ్యపడటం లేదు. గోతులుగా మారిన ఈ ప్రాంతంలో కొంత మట్టి పోస్తే నీరు నిలచిపోకుండా ఉంటుంది. తద్వారా వ్యాయామం చేయడానికి, ఓపెన్ జిమ్ పూర్తి స్థాయిలో వినియోగించడానికి వీలుగా ఉంటుందని పలువురు స్థానికులు సూచిస్తున్నారు.

తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వండి



విశాలాక్షినగర్ వాసులకు అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీరావు

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డులో పారిశుధ్య విభాగం అధికారులు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గురువారం విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం ప్రాంతాల్లో స్థానికులకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఇళ్లలో తడి, పొడి చెత్తను వేరుచేసి వేర్వేరు డబ్బాల్లో వేయాలని వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీరావు సూచించారు. ఆ చెత్తను ప్రతి రోజు వీధుల్లోకి వచ్చే పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. వీధుల్లో చెత్త వేయవద్దని కోరారు. ప్రతి బుధవారం సాయంత్రం పార్కులను శుభ్రం చేస్తున్నామన్నారు. పార్కులకు వెళ్లే వారు వేస్టేజీని ఎక్కడబడితే అక్కడ కాకుండా డస్ట్ బిన్లలో వేయాలని, పార్కులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

గెడ్డల్లో పూడికతీత



గెడ్డలో పూడిక తొలగిస్తున్న సిబ్బంది

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు రామ్‌నగర్ తదితర ప్రాంతాల్లోని గెడ్డల్లో పేరుకుపోయిన పూడికను గురువారం పారిశుధ్య సిబ్బంది తొలగించారు. గెడ్డల్లో పేరుకుపోయిన చెత్తపై స్థానికులు కార్పొరేటర్ పల్లా అప్పలకొండకు ఫిర్యాదు చేయగా.. ఆమె జీవీఎంసీ అధికారులతో మాట్లాడి పూడిక తొలగింపు చర్యలు చేపట్టారు. సమస్య పరిష్కారం కావడంతో కార్పొరేటర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు.

వీఎంఆర్‌డీఏ నర్సరీకి కొత్త హంగులు



రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేస్తున్న బ్రిక్ వాల్స్



కొత్తగా నిర్మిస్తున్న పంప్‌హౌస్



ఎంవీపీ కాలనీ సెక్టార్-7లో కొత్తగా నిర్మిస్తున్న నర్సరీ కార్యాలయం

- రూ.70 లక్షలతో సెంట్రల్ నర్సరీగా అభివృద్ధి
- ఆఫీస్ రూమ్, సేల్ పాయింట్, పంప్‌హౌస్‌ల నిర్మాణం
- ఆహ్లాదకరంగా బనియన్ ట్రీ ఏర్పాటు
- జూన్ చివరి నాటికి పనుల పూర్తి

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–7లోని నర్సరీకి వీఎంఆర్‌డీఏ కొత్త హంగులు అద్దుతోంది. దశాబ్దాలుగా నగరవాసులకు తక్కువ ధరలకే ఇండోర్, అవుట్‌డోర్ మొక్కలను దీని ద్వారా వీఎంఆర్‌డీఏ అందిస్తోంది. ఇక్కడ సిబ్బంది పెద్ద ఎత్తున మొక్కలను అభివృద్ధి చేసి సంస్థ నిర్దేశించిన తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ పర్యవేక్షణలో ఈ నర్సరీ నడుస్తుండగా.. దీని సేవలను నగర వాసులు వినియోగించుకుంటున్నారు. దీనిని సెంట్రల్ నర్సరీగా అభివృద్ధి చేసి సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే వీఎంఆర్‌డీఏ కమిషనర్ ఆదేశాల మేరకు యంత్రాంగం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. అందుకు అనుగుణంగా ప్రస్తుతం అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. జూన్ చివరి నాటికి నర్సరీ పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు చెబుతున్నారు.

రూ.70 లక్షలతో అభివృద్ధి పనులు

ప్రస్తుతం రూ.70 లక్షలతో నర్సరీ అభివృద్ధి పనులను వీఎంఆర్‌డీఏ చేపడుతోంది. వీటిలో భాగంగా శిథిలావస్థకు చేరిన కార్యాలయం స్థానంలో కొత్తది నిర్మిస్తున్నారు. దీంతో పాటు సేల్స్ పాయింట్, స్టోర్ రూమ్స్ కోసం కొత్త భవనం, నర్సరీ నీటి అవసరాలకు అనుగుణంగా కొత్తగా పంప్‌హౌస్ నిర్మాణం జరుగుతోంది. వినియోగదారుల కోసం పార్కింగ్ పాయింట్‌ను నిర్మిస్తున్నారు. నర్సరీలోని రోడ్లకు ఇరువైపులా బ్రిక్ వాల్స్ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. వినియోగదారులు సేదతీరేందుకు బనియన్ ట్రీ పేరుతో ఆహ్లాదకరంగా ప్రత్యేక నిర్మాణం చేపట్టారు. త్వరలో రహదారి పనులు కూడా ప్రారంభం కానున్నాయి. వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఇటీవల అథారిటీ ఇంజినీరింగ్, ఫారెస్ట్ అధికారులతో కలిసి నర్సరీని సందర్శించి అవసరమైన సూచనలిచ్చారు. రానున్న రోజుల్లో నగరాన్ని హరితవనంగా మార్చడంలో ఈ సెంట్రల్ నర్సరీ కీలక భూమిక పోషిస్తుందన్నారు.



నర్సరీ పనులపై అధికారులకు సూచనలిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్(ఫైల్)



నర్సరీలో నిర్మిస్తున్న బనియన్ ట్రీ ఆకృతి

జూన్ చివరి నాటికి పూర్తి

కమిషనర్ ఆదేశాల మేరకు వీఎంఆర్‌డీఏ నర్సరీని సెంట్రల్ నర్సరీగా అభివృద్ధి చేస్తున్నాం. ప్రస్తుతం నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. కార్యాలయం, పంప్‌హౌస్‌లు దాదాపు సిద్ధమయ్యాయి. మరికొన్ని నిర్మాణాలు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. రహదారి నిర్మాణం త్వరలో చేపట్టాల్సి ఉంది. జూన్ చివరి నాటికి పూర్తిస్థాయిలో నర్సరీ సిద్ధమవుతుంది.

– శ్రీనివాసరెడ్డి, ఏఈ, వీఎంఆర్‌డీఏ

అనధికార కంటైనర్ బడ్డీ తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: స్థానిక 13వ వార్డు దీన్‌దయాల్‌పురం వద్ద జీవీఎంసీ స్థలాన్ని ఆక్రమించి అనధికారికంగా ఓ వ్యక్తి ఏర్పాటు చేసిన కంటైనర్ బడ్డీని టౌన్ ప్లానింగ్ అధికారులు ఎట్టకేలకు తొలగించారు. బీఆర్‌టీఎస్ రహదారి పక్కన దీన్‌దయాల్‌పురం కూడలి వద్ద వార్డులో కొందరు టీడీపీ నాయకుల అండతో ఓ వ్యక్తి కంటైనర్ ఏర్పాటు చేశాడు. దీనికి అదే టీడీపీ నాయకుల ఒత్తిడితో విద్యుత్ విభాగం అధికారులు విద్యుత్ మీటర్ కూడా ఏర్పాటు చేసేశారు. దీనిపై 'కాసులిచ్చుకో.. బడ్డీ పెట్టుకో' అనే శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించారు. గురువారం జోన్–2 టీపీవో బాలరాజు, స్క్వాడ్ సిబ్బంది పొక్లెయిన్‌తో కంటైనర్‌ను అక్కడి నుంచి తొలగించారు. దాన్ని పొక్లెయిన్‌తో తీసుకెళ్లి ముడసర్లోవ సీవేజ్ ప్లాంట్ ఆవరణలో పడేశారు. అధికారుల చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. దీంతో పాటు వార్డులో మిగిలిన చోట్ల జరుగుతున్న అక్రమాలు, ఆక్రమణలపై కూడా అధికారులు దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.



దీన్‌దయాల్‌పురం కూడలి వద్ద ఏర్పాటు చేసిన కంటైనర్ బడ్డీని పొక్లెయిన్‌తో తొలగిస్తున్న సిబ్బంది

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: విమ్స్ సబ్ స్టేషన్ 33/11 కేవీ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్–3 ఈఈ(ఆపరేషన్) పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సబ్ స్టేషన్‌కు సంబంధించిన కైలాసగిరి, ఇందిరానగర్, రెవెన్యూ కాలనీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు, మెయింటినెన్స్ పనులు, చెట్ల కొమ్మల తొలగింపు తదితర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈమేరకు విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, షిర్డీసాయి వెటర్నరీ కాలనీ, చలపతినగర్, సంజీవినగర్, హనుమంతవాక కొండవాలు, బీఎస్‌ఆర్ నగర్, తోటగరువు, రవీంద్రనగర్, సుందర్‌నగర్, ఆదర్శనగర్, ఇందిరానగర్, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఈఈ కోరారు.

కేఎంఆర్ కాలేజీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

విశాఖ విద్య: విద్యార్థులను మోసగించిన మధురవాడ కేఎంఆర్ జూనియర్ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం పిఠాపురం కాలనీలోని ఆర్‌ఐవో కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నితిన్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడాలని చూసిన కేఎంఆర్ జూనియర్ కళాశాల అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఫేక్ ఎంసెట్ హాల్‌టికెట్లు అందించిన కారణంగా ఐదుగురు పరీక్ష రాయలేకపోయారన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ఆర్‌ఐవో మురళీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి ప్రసాద్, స్టేట్స్ సోషల్ మీడియా కన్వీనర్ వివేక్, జోనల్ ఇన్‌చార్జి ధనుష్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌ఐవో మురళీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఎంవీపీ రైతుబజార్‌లో ఆధునికీకరణ పనులు



ఎంవీపీ రైతుబజార్ కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగిస్తున్న కార్మికులు



ఆధునికీకరించిన రైతుబజార్ టాయిలెట్లు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ రైతుబజార్ ఆధునికీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. రైతుబజార్ మెయింటినెన్స్ పనుల పేరిట జిల్లా మార్కెటింగ్ శాఖ ఇవి నిర్వహిస్తోంది. చాలా కాలంగా రైతుబజార్‌లో పూడిక పేరుకుపోయిన డ్రైనేజీని ఆధునికీకరిస్తున్నారు. టాయిలెట్ల మరమ్మతులు, పెయింటింగ్స్, స్టాల్స్ రిపేర్లతోపాటు ఇతర పనులు జరుగుతున్నాయి. మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ విజయ సునీత ఇటీవల ఎంవీపీ రైతుబజార్‌ను సందర్శించిన సందర్భంలో త్వరితగతిన మెయింటినెన్స్ పనులు చేపట్టాలని ఆదేశించిన నేపథ్యంలో జిల్లా అధికారులు ఈ పనులకు శ్రీకారం చుట్టారు. రూ.8.5 లక్షలతో ఆయా పనులు జరుగుతున్నాయి.

సక్రమంగా పనిచేయకపోతే కఠిన చర్యలు

మహారాణిపేట: ఆరోగ్య కార్యక్రమాల ప్రణాళిక ప్రకారం పని చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం చినవాల్తేర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని (యూపీహెచ్‌సీ) సందర్శించారు. అక్కడ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఆరోగ్య కార్యక్రమాల గురించి వివరించారు. పట్టణ ఆరోగ్య కేంద్రంలో అన్ని ఆరోగ్య ఇండికేటర్లు తక్కువగా ఉండటంతో సిబ్బందికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు సాయంత్రం 4 గంటల వరకు క్షేత్ర సందర్శనలో ఉండి అభ ఐడీ నమోదు, ఎన్‌సీడీసీడీ సర్వే చేయాలన్నారు. జూన్ 15 లోపు శత శాతం సాధించాలన్నారు. ఆశ కార్యకర్తలు సక్రమంగా విధులు నిర్వర్తించనట్లయితే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డ్యూటీ ఉండగా మధ్యాహ్నం 12.30 గంటలకే ఆశ కార్యకర్తలు కనిపించడం లేదన్నారు. వీరిచేత తక్షణమే డ్యూటీ చార్ట్ ప్రకారం పని చేయించుకోవాలని, ఈ బాధ్యతలను కేంద్రం వైద్యులు పర్యవేక్షించాలన్నారు. ఈ సందర్శనలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ లూసీ, డాక్టర్ బి.హారిక, ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చినవాల్తేరు యూపీహెచ్‌సీలో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

50 రోజులు నిర్విరామంగా చలివేంద్రం సేవలు



విద్యార్థినులకు మజ్జిగ అందజేస్తున్న సుంకరి రాజేంద్ర

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ ఆళ్వార్‌దాస్ సర్కిల్‌లో నిర్వహిస్తున్న చలివేంద్రం సేవలు 50 రోజుల పాటు నిర్విరామంగా కొనసాగాయి. ఆళ్వార్‌దాస్ గ్రూప్‌నకు చెందిన వీఎంసీ డిగ్రీ, ఏఎస్ రాజా జూనియర్ కళాశాలలు సంయుక్తంగా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. గురువారంతో ఈ కార్యక్రమానికి 50 రోజులు పూర్తయినట్లు నిర్వాహకులు తెలిపారు. సుమారు 1,200 మందికి చల్లని తాగునీరు, మజ్జిగ అందించినట్లు చెప్పారు. ఈ సేవలు మరికొన్ని రోజుల పాటు కొనసాగుతాయన్నారు. ఈ కళాశాలల కార్యదర్శి సుంకరి రాజేంద్ర, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాహుల్‌లు పాల్గొని చలివేంద్రంలో పలువురు బాటసారులు, విద్యార్థినులకు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు అనర్థాలపై అవగాహన రేపు

మద్దిలపాలెం: ఈ నెల 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పొగాకు తాగడం వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు మాజీ బ్యాంక్ ఉద్యోగి జి.ఎస్.శివప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా తాను సేకరించిన సిగరెట్ తాగేవారు ఉపయోగించే పలు రకాల పరికరాలతో ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 15వ వార్డు జీఆర్ నగర్‌లోని తన ఇంటి వద్ద 31వ తేదీ శనివారం ఈ పరికరాలతో యువకులకు అవగాహన కల్పిస్తానన్నారు. ఆర్థిక ఇబ్బందులు, పర్యావరణ కలుషితం, అనేక వ్యాధులకు, ఉత్పాదకత నష్టాలకు కారణమవుతున్న పొగాకును నిర్మూలించాలని శివప్రకాష్ పిలుపునిచ్చారు. పొగ తాగడం వల్ల క్యాన్సర్, గుండెపోటు, మెదడు పోటు వంటి ప్రమాదకర వ్యాధులు సంభవిస్తున్నాయని, దీనికి యువత దూరంగా ఉండాలని హితవు పలికారు.



వివిధ రకాల సిగరెట్ పరికరాలు

సౌర విద్యుత్‌పై ఇంటింటా అవగాహన

మద్దిపాలెం: జోన్–2 ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధిలో సోలార్ విద్యుత్‌పై ఇంటింటా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకంపై ఎస్ఈ శ్యాంబాబు, ఏఈ వెంకటేశ్వరరావు, సిబ్బందితో కలిసి గురువారం మాధవధారలోని ప్రతి ఇంటికి వెళ్లి సౌర విద్యుత్ వాడడం ద్వారా కలిగే ప్రయోజనాలను వారికి వివరించారు. ఇంటిపైనే సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకుని ఇంటికి సరిపడా విద్యుత్‌ను వినియోగించుకోవచ్చన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కూడా అందిస్తుందన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం రేపు

సీతంపేట: టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు శిష్టకరణం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందించే కార్యక్రమం ఈ నెల 31న ప్రేమ సమాజంలో నిర్వహించనున్నారు. ప్రతిభా పురస్కారాలు అందుకోనున్న విద్యార్థుల జాబితాను విశ్వభారత్ చైర్మన్ బలివాడ రమేష్ పట్నాయక్ చేతుల మీదుగా గురువారం అక్కయ్యపాలెంలోని సంస్థ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిష్టకరణం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలతో చిరు సత్కారం చేస్తూ వారిని ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు పట్నాయక్, వ్యవస్థాపక అధ్యక్షుడు మానాపురం సురేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలలా అన్ని జిల్లాల నుంచి టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన 100 మంది విద్యార్థులకు శిష్టకరణం యువత ప్రతిభా పురస్కారాల పేరిట అవార్డులు అందజేస్తున్నట్టు తెలిపారు.



పురస్కారాలకు ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల చేస్తున్న బలివాడ రమేష్

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో వేదికపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి ప్రత్యేక పూజలు, నిత్యకల్యాణం జరిపారు.

నోరూరిస్తున్న నేరేడు

మద్దిలపాలెం: నేరేడు పండ్లు నగర వాసుల నోరూరిస్తున్నాయి. నీలి రంగులో నిఘనిఘలాడుతున్న తాజా నేరేడు పండ్లను తోపుడుబండ్ల వ్యాపారులు విక్రయిస్తున్నారు. సీజనల్‌గా లభించే ఫలాలు ఆరగిస్తే ఆరోగ్యానికి మంచిదని భావించిన ప్రజలు నేరుడు పండ్లను ఆస్వాదిస్తున్నారు. హైవేపై హనుమంతువాక, వెంకోజీపాలెం, ఎంవీపీ కాలనీ, మద్దిలపాలెం బజార్ తదితర ప్రాంతాల్లో నేరేడు పండ్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ప్రతి ఏడాది జూన్, జూలై మాసాల్లో మాత్రమే లభించే ఈ పండ్లకు నగరంలో మంచి గిరాకీ లభిస్తుందని విక్రయదారులు పేర్కొంటున్నారు. మే నెలలోనే సీజన్ ప్రారంభం కావడంతో ప్రస్తుతం రాయగడ నుంచి నేరేడు పండ్లను దిగుమతి చేసుకుంటున్నామన్నారు. మరో 15 రోజుల్లో రాష్ట్రంలోని మదనపల్లి నుంచి దిగుమతి ఆరంభమవుతుందని చెప్పారు. రాయగడ పండ్లు కాస్తా చిన్న సైజ్‌లో ఉంటాయన్నారు. మదనపల్లి నేరేడు పండ్లు చక్కని సైజ్‌లో నోరూరించేలా దగదగలాడుతాయని చెబుతున్నారు. అర కిలో రూ.120, కిలో రూ.240 చొప్పున పండ్లు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు. ఇప్పటికే నేరేడు కొనుగోలు చేసేవారి సంఖ్య పెరిగిందన్నారు. వీటిలో ఉప్పు, కారం, నిమ్మరసం మిక్స్‌చేసి తింటే ఆ రుచే వేరే స్థాయిలో ఉంటుందని నేరేడు పండ్ల ప్రియులు పేర్కొంటున్నారు. అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉండే నేరేడు పండ్లను ప్రతి ఏడాది ఒకసారైన ఆరగించాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.



తోపుడు బండిపై విక్రయిస్తున్న నేరేడు పండ్లు

హ్యూమన్ రైట్స్ సెల్ నూతన కార్యవర్గం

సీతంపేట: హ్యూమన్ రైట్స్ సెల్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అక్కయ్యపాలెం జీవీఎంసీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు ఎం.ఎ న్.వి.విశ్వనాథం నియమితులయ్యారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని సంస్థ కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు వి.రామకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.పి.శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.ఎం.నాయుడు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి కె.రాజా చేతుల మీదుగా గురువారం ఆయన నియామక పత్రం అందుకున్నారు. విశాఖ జిల్లా అధ్యక్షుడిగా వి.చంద్రమౌళి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.ఎస్.ఎన్.రాజు, ఉపాధ్యక్షుడిగా ఎస్.దొరబాబు, మహిళా ఉపాధ్యక్షురాలిగా దీనాకుమారి, జాయింట్ సెక్రటరీలుగా కుప్పిలి గోవింద్ పట్నాయక్, ఎస్.కుష్వంత్, కోశాధికారిగా పి.సత్యనారాయణ రెడ్డి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం చేత జె.ఎం.నాయుడు ప్రమాణ స్వీకారం చేయించారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు